క్లుప్తంగా

తుంగభద్ర పరవళ్లు



మోటారును తొలగించుకుంటున్న రైతన్నలు

కౌతాళం: తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో విస్తరంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు తుంగభద్రనదికి 80వేల క్యూసెక్కులు నీరు వదిలారు. ఈ నీరు ఆదివారం ఉదయం ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మేళిగనూరుకు చేరాయి. దీంతో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. మేళిగనూరుతో పాటు మరళి, గుడికంబాలి, వల్లూరు, కడదొడ్డి, కుంబళనూరు వద్ద నీరు పూర్తిస్థాయిలో రావడంతో రైతులు తమ పంట పొలాల కోసం తీరం వెంబడి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను, పైపులను తొలగించుకోవడం కనిపించింది.

'ప్రజా ఫిర్యాదుల వేదిక' రద్దు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండరని, దీంతో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. పల్లె పండగ వారోత్సవాలు పూర్తి అయిన తర్వాత యథా విధిగా కొనసాగుతుందన్నారు.

క్రైస్తవులకు తోడుగా ఉంటా



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న క్రైస్తవులు

ఆదోని సెంట్రల్: క్రైస్తవ సమాజానికి తోడుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో జరుగుతున్న ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ ప్రజల మధ్యకు వెళ్లి ఆయా సమస్యలపై వారితో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. మనసుకు ప్రశాంతత కలిగించుకోవడం కోసం దైవ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటానని చెప్పారు. మతాలకు అతీతంగా అందరిని కలుసుకుని ఇలా ముందుకు సాగడం చాల సంతోషంగా ఉందన్నారు.

12వ రోజు గోవిందమ్మ దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: న్యాయం చేయాలని కోరుతూ పెదకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో బీసీల దాడికి గురైన దళిత మహిళ గోవిందమ్మ స్థానిక సోమప్ప సర్కిల్‌లో చేపట్టిన నిరదిక దీక్ష ఆదివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. దీక్షలో కూర్చున్న ఆమెకు సంఘీభావంగా పెద్దతుంబళం నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసప్ప, దేవరాజులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మినారాయణ, బతుకమ్మ, సుమాల చార్లెస్, మాల నరసప్ప, హుసేని, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 17న జరిగే శ్రీ వాల్మీకి జయంతి మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని శ్రీ వాల్మీకి జయంతి కార్యాచరణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీ వాల్మీకి భవనానికి కేటాయించిన స్థలంలో జయంతి కార్యచరణ కమిటీ సభ్యులు సమావేశమై, జయంతి వేడుకలపై చర్చించుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 17న జరిగే వాల్మీకి జయంతి మహోత్సవానికి వాల్మీకి కులబాంధవులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. జయంతి రోజున సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు.

సాయిబాబా మృతి ఉద్యమాలకు తీరని లోటు

ఎమ్మిగనూరుటౌన్: ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో మృతి చెందడం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 90 శాతం అంగవైకల్యం ఉన్న ప్రొ ఫెసర్ సాయిబాబాను 10ఏళ్ల పాటు జైల్లో వుంచాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ నిరంకుశవైఖరే కారణమన్నారు. ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఆయన చిరస్మరణీయులన్నారు.

నేటి నుంచి 'పల్లెపండుగ'

ఆదోని రూరల్/కోసిగి: ఆయా మండలాల్లో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు రాజేంద్రప్రసాద్, పి.వెంకటేశ్వర్లుఆదివారం తెలిపారు. వారోత్సవాల్లో గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యలను స్థానికంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు నేరుగా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ వెంకటేశ్వరస్వామి



డ్రైఫ్రూట్స్‌తో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ అలంకరణ




కౌతాళంలో పూజలందుకుంటున్న చౌడేశ్వరి దేవి



కందుకూరులో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శాంభవి దేవి



ఎమ్మిగనూరు కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు



ఎమ్మిగనూరులో నిమజ్జనానికి వెళ్తున్న దుర్గామాత ప్రతిమ



సోమలగూడూరులో రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు

- అట్టహాసంగా రావణ, కుంభకర్ణల దహన కార్యక్రమం
- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన మున్సిపల్ క్రీడా మైదానం
- ముగిసిన దసరా ఉత్సవాలు

వైభవంగా విజయదశమి



దహనానికి సిద్ధంగా ఉన్న రావణ, కుంభకర్ణ ప్రతిమల వద్ద ఎమ్మెల్యే పార్థసారథి, ప్రముఖులు



రావణ, కుంభకర్ణ దహన కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

ఆదోని అర్బన్: దసరా పండగను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదో రోజు శనివారం విజయదశమి వేడుక ఆదోని పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ మైదానం, ఫారెస్ట్‌లైన్ అంబాభవానీ ఆలయ ఆవరణలో రావణ, కుంభకర్ణల దహన కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. కిలిచినపేటలో అంబాభవానీ ఆలయం వద్ద, మంగరాయ ఆంజనేయస్వామి ఆలయ నుంచి మున్సిపల్ క్రీడా మైదానం వరకు రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత మున్సిపల్ క్రీడా మైదానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు వంద అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన రామబాణాన్ని దసరా శరన్నవ రాత్రోత్సవాల్లో ఉత్సవ కమిటీ పెద్దలు, పట్టణ ప్రముఖులతో కలిసి వెలిగించారు. ముందుగా రావణ, కుంభకర్ణలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ రావణ, కుంభకర్ణల ప్రతిమకు నిప్పుపెట్టగా నిమిషాల వ్యవధిలోనే దహనమయ్యాయి. దీంతో కాంతులు విరజిమ్మాయి. మైదానమంతా జై శ్రీరామ్ నామస్మరణతో హోరెత్తింది. ఉత్సవకమిటీ వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. మహిషాసుర సంహారం నాటకం, బ్రహ్మవిష్ణు మహేశ్వరుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రదర్శనలు తిలకించిన ఎమ్మెల్యే వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లప్ప, ఎం.డి. బసవరాజ్, నాగరాజుగౌడ్, శ్రీనివాస ఆచారి, చెన్నబసప్ప, నాగరాజ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో..

తిరుమలనగర్‌లో వెలిసిన పద్మావతి, వెంకటేశ్వర స్వామి వార్లకు ఆలయ మేనేజర్ ఈరన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి గరుడ ఉత్సవం పుర వీధుల్లో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సభ్యులు విట్టా రమేష్, డాక్టర్ గోపీనాథ్, ఉషారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శమీ పూజలు

నందవరం : దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి, పార్వతీ దేవి రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో ఆది దంపతులకు(శివపార్వతి) జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చనలు, నమక చమక పూజాలు గావించారు. అనంతరం భక్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయత్రం ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులు శమీ వృక్షాన్ని పూజాలు చేపట్టారు. అలాగే సోమలగూడూరులో పెద్దమ్మవ్వ ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నందవరంలో బంగారమ్మవ్వ, మారెమ్మవ్వ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేకాలంకరణ గావించి పూలమాలలు చేశారు. ఇబ్రహీంపురం, జొహరాపురం గ్రామాలలో భక్తులు భజనలు చేసుకుంటూ జమ్మి చెట్టు ప్రత్యేక పూజాలు నిర్వహించారు.

గోనెగండ్ల : మండలంలోని ప్రజలు దసరా వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఆయా దేవాలయాల్లో తొమ్మిది రోజుల పాటు దసరా నవరాత్రుల్లో అమ్మవారు దర్శనమిచ్చే అన్ని రూపాలను అలంకరించి మహిళల ప్రతిరూపాలుగా నిత్యం మన కళ్లముందు కనిపించేలా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం వీరశైవమతం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో జమ్మిచెట్టుకు పూజలు చేసి, ఆకు తీసుకొని పెద్దలకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు.

దుర్గామాత నిమజ్జనోత్సవం

ఆదోని అర్బన్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పది రోజులపాటు మున్సిపల్ క్రీడా మైదానంలో కొలువుదీరిన దుర్గామాతకు ఆదివారం నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కమిటీ సభ్యులతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ క్రీడా మైదానంలో కొలువుదీరిన దుర్గామాతను ట్రాక్టర్‌లో ఉంచి మైదానం నుంచి పాత బస్టాండు, ఏరియా ఆస్పత్రి మీదుగా చిన్నహరివాణం వద్దనున్న ఎల్ఎల్‌సీ ఘాట్ కాలువలో నిమజ్జనం చేశారు. ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే స్వయంగా నడుపుతూ ముందుకు తీసుకెళ్లారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

కౌతాళం: దసరా సందర్భంగా మండల కేంద్రమైన కౌతాళంతో పాటు హాల్వి, కామవరం, ఉరుకుంద, కుంటనహాల్, ఉప్పరహాల్, బాపురం, ఎరిగేరి, చిరుతపల్లి, సులేకేరి, నదిచాగి గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 9రోజుల పాటు నిర్వహించిన జగన్మాథదేవి పురాణాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు మహామంగళహారతి కార్యక్రమంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా చౌడేశ్వరి ఆలయంలో వెలసిన చౌడేశ్వరిదేవి, కౌతాళం శివారు ప్రాంతంలో రౌడూరు పొలిమేరలో వెలసిన ఆదిబసవేశ్వర ఆలయంలోని దుర్గాదేవి ఊరేగింపు కౌతాళంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం అర్చకులు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం కాళికాదేవి ఉత్సవ మూర్తిని గ్రామ పుర వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. మేళిగనూరులో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో, బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

కోసిగి: మండలంలోని విజయ దశమి వేడుకలు(దసరా) శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వెలసిన బీరప్ప స్వామి పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే కాళికా దేవి, చౌడేశ్వరి దేవి ఎల్లమ్మదేవి, సత్యదుర్గాంభిక దేవి, గ్రామ దేవతలు మారెమ్మ దేవి, లక్ష్మమ్మ దేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జెమ్మి చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న పెద్దల పాదాభివందనాలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో శాంభవి దేవి ఆలయంలో ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి రాంపురం గ్రామంలో జమ్మిచెట్టుకు పూజలు చేసుకున్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో శనివారం దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో తెల్లవారుజామున నుంచే భక్తుల సందర్శనార్థం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. వేదగాయిత్రీ మాత ఆలయంతో పాటు వీవర్స్ కాలనీమైదానంలో ఏర్పాటు చేసిన మండపంలో, తేరుబజారుతో పాటు పలు ఆలయాల్లో అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు వీవర్స్‌కాలనీ మండపంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి దంపతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా ఆర్యవైశ్య సంఘ నాయకులు వారిని శాలువాలు కప్పి సత్కరించారు. అదేవిధంగా డీఎస్పీ ఉపేంద్రబాబు, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుంచిన దర్గామాత విగ్రహాలను ఎల్లెల్సీలో నిమజ్జనం చేశారు.



ఎమ్మిగనూరు: అమ్మవారి పూజలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



గోనెగండ్లలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి, భక్తులు



ఆదోనిలో దేవతల వేషధారణలో చిన్నారులు



జొహరాపురంలో జమ్మి చెట్టుకు పూజలు



ఆదోనిలో దుర్గామాత ఊరేగింపు

వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహ మహోత్సవం



విగ్రహమహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) పూజలందుకుంటున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి విగ్రమహోత్సవం వేలాది మంది భక్తుల హర్షధ్వనాల మధ్య ఆదివారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు అత్యంత వైభవంగా జరిగింది. దసరా వేడుకలు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి ఏవిధంగా తొమ్మిది రోజులు పూజలు చేస్తారో, ఇక్కడ చెన్నకేశవస్వామికి ఆదేవిధంగా పూజలు చేయడం ఆనవాయితీ. విగ్రహమహోత్సవానికి కందనాతి, మసీదపురం, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి గ్రామల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ప్రారంభమైన చెన్నకేశవస్వామి విగ్రహమహోత్సవంలో నాలుగు వైపుల నాలుగు గ్రామల ప్రజలు పల్లకీని మోశారు. కొండపై నుంచి కిందకు స్వామిని తీసుకువచ్చే ప్రయత్నంలో అవస్థలు పడ్డారు. మిద్దెలపై నుంచి పెద్ద పెద్ద తాళ్లతో కట్టి విగ్రహం కిందకు పడకుండా జాగ్రత పడ్డారు. స్వామి పల్లకీని గ్రామ పొలిమేరలోని జమ్మి చెట్టు దగ్గరకు తీసుకెళ్లి పూజలు చేసి, మరలా కొండ మీదికి చేర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ విక్రమసింహా, ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మహోత్సవం సందర్భంగా గ్రామంలో కోలాటాలు నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దర్శించు కున్నారు.

విగ్రహ మహోత్సవంలో అపశృతి

విగ్రహ మహోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని కొండపైకి చేర్చే క్రమంలో ప్రభ 2 సార్లు పక్కకు వంగిపోవడంతో విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ సరఫరా నిలిపివేడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే హరికృష్ణ, గుడిసె వినోద్, మాసుమాన్‌దొడ్డి భీమేష్, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

అదుపుతప్పి కారు బోల్తా



రోడ్డు పక్కన బోల్తా పడిన కారు

గోనెగండ్ల : మండలంలోని వేముగోడు గ్రామ సమీపంలో తెలంగాణకు చెందిన కారు శనివారం ఉదయం అదుపు తప్పి గుంతలో పడింది. తెలంగాణకు చెందిన చంద్రశేఖర్ తన కారులో సొంత పనుల నిమిత్తం ఆదోని పట్టణానికి వెళ్తుండగా.. వేముగోడు గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న చంద్రశేఖర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో గమనించిన స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దుర్గమ్మ గుడి వద్ద మండల స్థాయి ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పత్తికొండలో ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా దుడ్డు రామకృష్ణ మాదిగ హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్, మండల అధికారి ప్రతినిధి నరసింహులు, నరసయ్య, కోడి ఉరుకుందు, అంజి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శారదా నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్‌లోని శ్రీ శారద శంకరమఠంలో శారదా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి ఆదివారం వరకు 11 రోజులపాటు ఘనంగా శారదా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. విద్యావాచస్పతి డా.గరుడాద్రి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో దేవాలయ విచారణకర్త డాక్టర్ కృష్ణదేవరాయలు నేతృత్వంలో అంగరంగ వైభవంగా వందలమంది ముత్తైదువులతో ప్రతిరోజూ శారదా దేవికి పూజలు చేశారు. మూలా నక్షత్రము రోజున శారదాదేవిని చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. విజయదశమి రోజున శమీ వృక్ష దర్శనం, ఆదివారం పల్లకి సేవ, వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగించారు. ఈ సందర్భంగా శారదా బ్రహ్మోత్సవాలకు సహకరించిన వారందరికీ శ్రీ శారదా చంద్రమౌళీశ్వరస్వామి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మఠం మేనేజర వెంకటేశ్వరరావు, డాక్టర్ కృష్ణదేవరాయశర్మ, డా.రాఘవేంద్రరావు, డా.వసంతమాధవ్, రిటైర్డ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అప్పశాస్త్రి, రిటైర్డ్ ఎంఈఓ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్, నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎర్రకోటలోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలంతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూలమాలలు వేసి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మాజీ టౌన్, కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్, వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, సీనియర్ నాయకులు భీమిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పట్టణం నుంచి కోడుమూరుకు వెళ్లే ప్రధాన రహదారితో పాటు కోసిగి, గూడూరు రోడ్లు సైతం పూర్తిగా శిథిలమయ్యాయని, వాటిని పునర్నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు ఖాశింవలి, ఎస్ఐస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్‌లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అదేవిధంగా పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న తదితరులు వినతిపత్రాన్ని ఇచ్చారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

గోనెగండ్ల : స్నేహితుడు ఇటీవల అకాల మరణం చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కలిసి చదువుకున్న పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చి ఆదుకున్నారు. పెద్దమరివీడు గ్రామానికి చెందిన కటికె నబీ రసూల్ ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అయితే నబీ రసూల్ ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఈనెల 25న నబీ రసూల్ కూతురు షాబానా వివాహం ఉందని తెలుసుకున్న 1999–2000 బ్యాచ్ పదో తరగతి నబీ రసూల్‌తో కలిసి చదువుకున్న విద్యార్థులు చేయి చేయి కలిపి రూ.50వేల నగదును పోగుచేశారు. ఆదివారం పెద్దమరివీడు గ్రామానికి వెళ్లి మృతుడి భార్య నసుబీకు నగదును అందజేశారు. అలాగే స్నేహితుడి ఇద్దరు పిల్లల చదువుకు కావాల్సిన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్షావలి, గానిగ బాషా, జిక్రియా, ఖాసీం సాహెబ్, కృష్ణ, రంగస్వామి, వీరేష్, రంగన్న, జనార్ధన్, రామకృష్ణ, రసూల్ పాల్గొన్నారు.